భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# రాజకీయ పరిణామాలపై రిపోర్టు

(జూలై 24–26, 2017 కేంద్ర కమిటి సమావేశంలో ఆమోదింపబడినది)

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# అంతర్జాతీయం

కిందటిసారి ఏప్రిల్‌లో జరిగిన కేంద్ర కమిటీలో మనం అంతర్జాతీయ పరిస్థితులను, ప్రపంచ ఆర్థిక పరిస్థితితో సహా వివరంగా చర్చించుకున్నాము. అందువలన ఇప్పుడు కేవలం ఆ తరువాత కాలంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ముఖ్యమయిన విషయాలను, ముఖ్యంగా మన దేశంపై ప్రభావం చూపే వాటినే ప్రధానంగా చర్చిద్దాము .

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ బ్యాంకు జూన్ 2017 గ్లోబల్ ఎకనామిక్ ప్రోస్పెక్ట్స్ ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నెమ్మది నెమ్మదిగా పుంజుకుంటున్నది. గడచిన చాలాఏళ్లలో మొదటిసారిగా జనవరిలో సూచిక కన్నా ఈ యేడు జూన్‌లో సూచిక తగ్గించబడలేదు. అయినప్పటికీ ప్రపంచ బ్యాంకు "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దిగజారే అవకాశాలనుండి ఇంకా బయటపడలేదు" "అని పేర్కొన్నది, అందువలన అభివృద్ధి చెందిన దేశాలలో, అభివృద్ధి చెందుతున్న దేశాలలో, కొత్తగా అభివృద్ధి బాట పడుతున్న దేశాలలో ('ఇఎండిఇ'లు) కూడా దీర్ఘకాలంగా ఈ ఉత్పాదకతలో తరుగుదల కొనసాగే సంభావ్యత, పెట్టుబడులు మరింత బాలహీనపడే అవకాశాలున్నాయని సూచిస్తున్నది. 2008 తరువాత 'ఇఎండిఇ'ల ఆర్థిక స్థితి బలహీనపడిందని, ప్రయివేటు రుణాలు పెరిగాయని ముఖ్యంగా గమనించవలసినది ఉంది. భారతదేశానికి సంబంధించినంత వరకు ప్రయివేటు కార్పొరేట్లు రుణాలు తిరిగి చెల్లించని కారణంగా పారుబకాయిలు విపరీతంగా పెరగడం దీనిని నిరూపిస్తున్నది. ఒక అంచనా ప్రకారం వడ్డీతో కలుపుకుని ఈ పారుబకాయిలు పది లక్షల కోట్లను దాటి ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగానే 'ఇఎండిఇ'ల ఆర్థిక సమతుల్యత గత పది సంవత్సరాల కాలంలో, అంటే 2007-2016 మధ్య దాదాపు 6% దిగజారింది. దాదాపు 60% 'ఇఎండిఇ'లలో ప్రభుత్వ అప్పులు, స్థూల జాతీయ ఉత్పత్తిలో 10% నికి మించి ఉన్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లకు లోనవుతున్నదని సూచిస్తున్నది. ఇందువలన జరిగే ఒక

ముఖ్యమయిన పరిణామం, ప్రభుత్వ ఖర్చులు ప్రపంచ వ్యాప్తంగానే ఈ ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకునేందుకు మరింతగా కుదించబడతాయి. ఇందువలన ప్రపంచ వ్యాప్తంగా సామాజికరంగానికి పెట్టె ఖర్చులు తగ్గుతాయి; నిరుద్యోగుల సంఖ్య పెరగి అశేష ప్రజలు మరిన్ని కష్టాలపాలవుతారు. ఇప్పటికే అమలవుతున్న పొదుపు చర్యలు మరింతగా పెరిగి ప్రజల పరిస్థితి మరింత దిగజారుతుంది.

అంటే ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, దశాబ్దకాలంగా కొనసాగుతున్న సంక్షోభం నుండి ప్రపంచ ప్రజలను మరింతగా దోచుకుని బయటపడాలనుకుంటున్నది.

### రాజకీయంగా మితవాదం వైపు మొగ్గు

ఇంతకుముందు సమావేశాలలో, ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం కొనసాగుతున్నదని, ప్రపంచ వ్యాప్తంగా దీని రాజకీయ ప్రతిస్పందన మితవాద రాజకీయాలవైపుకు మొగ్గుతున్నదని చెప్పుకున్నాము. అదే సమయంలో ప్రపంచంలోని చాలా దేశాలలో ఈ ఆర్థిక సంక్షోభం వేసే ఆర్థిక భారాలకు వ్యతిరేకంగానూ, మితవాద రాజకీయాలవైపుకు మరలడానికి వ్యతిరేకంగానూ ప్రజలు పోరాటాలు చేయడం చూస్తున్నాము. ఇది కార్మిక వర్గం చేసే సమ్మెలు పెరగడంలోనూ, కొన్ని దేశాలలో, ముఖ్యంగా ఫ్రాన్స్‌లో, ప్రభుత్వాలను హస్తగతం చేసుకునేందుకు ఎన్నికలలో మితవాదులకు వ్యతిరేకంగా అనేక కూటములు ఏర్పడడంలోనూ ప్రతిబింబిస్తుంది. అయితే ఫ్రాన్సులో అధ్యక్ష ఎన్నికలలో మితవాదులు ఓటమి నయా ఉదారవాద విధానాలను దారి మళ్ళిస్తుందని అనలేము.

## బ్రిటిష్ సాధారణ ఎన్నికలు

యూరోపియన్ యూనియన్ నుండి వైదొలిగే క్రమంలో తన వాదనకు బలం చేకూర్చుకునేందుకు, దేశంలో తన స్థానాన్ని స్థిరపరుచుకునేందుకు థెరెసా మే గడువు కన్నా ముందుగానే ఎన్నికలను నిర్వహించింది. ఇది అంచనాలను తారుమారు చేస్తూ ఎదురుదెబ్బకు దారితీసింది. ఇప్పుడు టోరీ పార్టీ ఎన్నో మితవాదరాజకీయ గ్రూపులతో రాజీలు కుదుర్చుకోవలసిన పరిస్థితికి దారితీస్తున్నది. అత్యంత సంకుచిత, లింగ వివక్షత కలిగి, ఉత్తర ఐర్లాండ్ నుండి నడిచే డెమోక్రాటిక్ యూనియనిస్ట్ పార్టీని కూడా కలుపుకోవలసి వచ్చింది. ప్రజల సమస్యలను, వారిపై ఆర్థిక భారాలు మోపడానికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన లేబర్ పార్టీ బ్రిటిష్ ఎన్నికలలో తిరిగి వర్గ రాజకీయాలను బలవంతంగా ముందుకు

తెచ్చింది. దానికి ఆధిక్యత రాకపోయినా, బలం బాగా పెంచుకుంది; వారి నాయకుడు జెరెమీ కార్బ్ బ్రిటన్‌లో ప్రజలకు సంబంధించిన రాజకీయాలను ముందుకు తేవడంలో సఫలీకృతుడయ్యాడు.

## సామ్రాజ్యవాద దుందుడుకుతనం

**సిరియా :** వేలాదిగా చనిపోయి లక్షలాదిగా నిరాశ్రయులయి, ఊరు వల్లకాడుగా మారినప్పటికీ, ఇరాక్‌లోని మసూల్, ఐఎస్ ను బయటకు పంపి స్వతంత్రతను ప్రకటించుకుంది; సిరియన్ సైన్యం, ఐఎస్ సిరియా అంతటా ముందుకు చొచ్చుకుని రాకుండా కట్టడిచేసి తమ దేశం భౌగోళిక హద్దులను తిరిగి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు, అమెరికా దాని మిత్రులు వారి ప్రయత్నాలను ద్విగుణీకృతం చేయడం మొదలుపెట్టాయి. అమెరికా వైమానిక దళం సిరియాలోని కీలక స్థావరాలపై జూన్‌లో బాంబు దాడిచేసి సీరియాని ఐఎస్ ను ఎదిరించలేని విధంగా బలహీనపరచాలనుకుంది. ఈ మధ్యనే వాల్ స్ట్రీట్ జర్నల్ ఇజ్రాయిల్, తిరుగుబాటు దళాలకు క్రమం తప్పకుండా ఆయుధాలను ఇతర సామాగ్రిని పంపుతుండేదని తెలిపింది. రష్యా వాయు సైన్య సహకారంతో సిరియా సైన్యం ముందుకు వెళ్లగలిగింది. అసాద్ పాలనలోని సిరియాను పడదోయడం సాధ్యం కాదని గ్రహించిన అమెరికా ఈ ప్రాంతంలో ఎప్పటికీ తన ముఖ్య లక్ష్యం అయిన ఇరాన్ వైపుకు ఇప్పుడు మళ్లడం మొదలుపెట్టింది. అయితే ఇందుకు సిరియాని మరింత బలహీన పరచవలసిన అవసరం ఉంది; ఈ ప్రాంతంలో మరిన్ని అమెరికా కొత్త స్థావరాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది; ఇరాన్ను మరింత ఒంటరిని చేయాల్సిన అవసరం ఉంది.

**కతార్ :** అరబ్బు రాజ్యమయిన కతార్‌ను ఒంటరిపాటు చేసి అణగద్రొక్కాలని సౌదీ అరేబియా ఎప్పటినుండో ప్రయత్నిస్తున్నది. ఇందుకు మొదటిలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశీస్సులు ఉన్నాయి. కానీ అమెరికా కతార్‌తో 12 బిలియన్ డాలర్ల యుద్ధ విమానాలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది.

కతార్ ఈ ప్రాంతంలోనే పదివేల కన్నా ఎక్కువ సైనికులు ఉన్న అతిపెద్ద అమెరికా మిలిటరీ స్థావరానికి ఆతిథ్యం ఇవ్వబోతున్నది. కతార్, అమెరికా కతార్ ఇరాన్‌లలో మిలిటరీ కార్యక్రమాలు నిర్వహించేందుకు కీలకమయిన ఆ ప్రాంత ప్రధాన కార్యాలయం సిఇఎం టిసిఓఎంకి కూడా ఆతిథ్యం ఇస్తున్నది. కతార్ ఇరాన్‌తో తనకిగల దౌత్య సంబంధాలను వెంటనే తెగతెంపులు చేసుకోవాలని, ఆల్ జజీరా ఎలక్ట్రానిక్ ప్రసారాలు తాత్కాలికంగా

నిలిపివేయాలని, హమాస్‌తో ముస్లిం బ్రదర్‌హుడ్‌తో సహవాసం చేసేవారినందరిని బహిష్కరించాలని, సౌదీ అరేబియా డిమాండ్ చేసింది. కతార్ ఇరాన్ ప్రపంచంలోనే అతి పెద్దదయిన సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌లో భాగస్వాములు. అందువలన ఈ ఇద్దరు హైడ్రో కార్బన్ విభాగంలో సహకరించుకొనవలసిన అవసరం ఉన్నది . సౌదీ, యూఏఈ, కతార్‌లో పాలనా వ్యవస్థ మార్చాలనుకుంటున్నారు గాని కతార్‌కి తన మిత్ర రాజ్యాలు తనకున్నాయి. ఇప్పుడింక అమెరికా దృష్టి ఇరాన్ వైపు మళ్లడం ఒక ముఖ్యమయిన పరిణామం. ఇదే రాబోయే కాలంలో పరిస్థితులు ఎలా మారతాయో నిర్ణయిస్తుంది. ఇప్పటికీ అమెరికా మధ్యప్రాచ్యంలో మిలిటరీ జోక్యానికి ఇజ్రాయిలే అత్యంత కీలకం.

**వెనిజులా :** లాటిన్ అమెరికాలో సామ్రాజ్యవాద సరికొత్త దూకుడులకు కళ్లెం వేసేందుకు వెనిజులా ఇప్పటికీ ఎంతో కీలకం. మదురో ప్రభుత్వాన్ని కూలదోసి అక్కడ తిరుగుబాటు వచ్చేందుకై, వెనిజులాలోని బొలీవియాన్ విప్లవాన్ని వ్యతిరేకించే అనేక మితవాద శక్తులకు అమెరికా సామ్రాజ్యవాదం కోట్లాది డాలర్లను వెదజల్లుతున్నది. ఈ ప్రయత్నాలు అక్కడ పెద్ద ఎత్తున హింసకు దారితీస్తున్నది; ఈ సాయుధ గ్రూపులకు ఈ ప్రాంతంలోని చుట్టుపక్కల ఉన్న సామ్రాజ్యవాద తొత్తులనుండే ప్రత్యక్షంగా సహాయం అందుతున్నది.

ఇటువంటి పరిస్థితులలో మదురో ప్రభుత్వం జాతీయ రాజ్యాంగ అసెంబ్లీని కొత్త రాజ్యాంగాన్ని తయారు చేయమని అడగడం ఒక వివాదాస్పదమయిన అంశం అయింది. వెనిజులా అధికారిక ప్రసార సాధనాలు రాజ్యాంగాన్ని సంస్కరించవలసి రావడానికి పది కారణాలు వెల్లడించింది. అందులో ముఖ్యమయినది " శాంతి కోసం రాజ్యాంగ ప్రక్రియ తయారుచేయడం" పౌరుల మధ్య సంఘర్షణలు పెంచేబదులు పరిష్కరించేందుకు వాతావరణం కల్పించడానికి అని చెప్పబడుతున్నది. మదురో ప్రభుత్వం ఈ కొత్త రాజ్యాంగం అమలు పరిచే ముందు రెఫరెండం పెడతానంటున్నది. చావెజ్ ప్రభుత్వ రాజ్యాంగం ఎంతో ప్రజానుకూలమని, అభివృద్ధి కాముకమని ఎక్కువమంది భావించి దానిని మార్చడానికి సంశయాలు వెలిబుచ్చుతున్నారు.

వెనిజులా ప్రభుత్వం శాంతిని నెలకొల్పేందుకు ప్రత్యర్థి శక్తులన్నింటిని చర్చలకు ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నది. వారు ఈ ప్రయత్నానికి పోప్ సహాయం కూడా తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే పోప్, ప్రత్యర్థులకు కావలసింది కేవలం అధికారమే కానీ శాంతి కాదన్న నిశ్చయాభిప్రాయానికి వచ్చి చర్చలలో భాగస్వామ్యులవడానికి తిరస్కరించారు.

బొలీవియాన్ విప్లవానికి, మదురో ప్రభుత్వానికి ఈ పోరాటంలో  మన సంపూర్ణ మద్దతు ఉంటుంది. భవిష్యత్తులో వెనిజులా పరిణామాలు ఎలా మలుపులు తిరుగుతాయో అన్నది  మొత్తం లాటిన్ అమెరికా ప్రాంతభవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

**క్యూబా :** మియామీలో జరిగిన ఒక బహిరంగసభలో, ముఖ్యంగా క్యూబా బహిష్కృతుల సభలో  మాట్లాడుతూ  అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్,  ఒబామా 'ఏకపక్షంగా క్యూబాతో' జరిపిన  ఒప్పందాన్ని రద్దు చేస్తానని బెదిరించాడు. క్యూబాను పూర్తిగా లొంగదీసుకునేందుకు క్యూబాతో సంబంధాలను పూర్తిగా రద్దుచేస్తామని, ఆర్థిక ఆంక్షలు పునరుద్ధరిస్తానని చెప్పుకొచ్చారు.

అందుకు సమాధానంగా క్యూబా అధ్యక్షుడు  రౌల్ క్యాస్ట్రో,  క్యూబా ఎన్నటికీ తలవంచదని  దృఢంగా  సమాధానం చెప్పారు. క్యూబన్ ప్రజలు, తాము అమెరికా సామ్రాజ్యవాదాన్ని, దాని సైనికీకరణ వ్యూహాలను  వ్యతిరేకించే తీరుతామని, విప్లవ క్యూబన్ ప్రభుత్వానికి వెన్నంటి ఉండి సోషలిజం యెడల నిబద్ధతని కలిగి ఉంటామని ఉత్సాహభరితంగా తిరిగి  ధ్రువపరిచారు.

**జి 20 :** జి 20 అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధారిత నయాఉదారవాద విధానాన్ని ప్రచారం చేస్తున్నది. భారతదేశం కూడా ప్రపంచవ్యాప్తంగా రుద్దబడిన ఈ విధానంలో భాగం అయింది. దీనినే పూర్తిగా అనుసరిస్తూ మన స్వాతంత్ర్యానికి మన ప్రజల జీవనోపాధికి కూడా నష్టం కలిగిస్తున్నది.

## పర్యావరణ  మార్పు

ముందుగా బెదిరించినట్టే డోనాల్డ్ ట్రంప్ పారిస్ పర్యావరణ ఒప్పందంనుండి తప్పుకున్నాడు. దీనిని 195 దేశాలు ఈ ఒప్పందాన్ని అంగీకరించగా అందులో 147 దేశాలు తమ తమ దేశాలలో దీనిని ఆమోదింపచేశాయి. అమెరికా 2001 లో,  క్యోటో ప్రొటోకాల్ నుంచి  వైదొలగి  బయటకు వచ్చింది. ఇప్పుడు అదే పద్ధతి  కొనసాగిస్తూ అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలకు మరోసారి  వెన్నుపోటు పొడిచింది. అప్పటినుండి కూడా అమెరికా తన కర్బన ఉద్గారాల తగ్గింపుకు బాధ్యతను  నిరంతరంగా నిరాకరిస్తూ, ప్రపంచంలోనే పర్యావరణాన్ని అత్యధికంగా  నాశనం చేస్తున్నది. 77% ప్రపంచ కర్బన ఉద్గారాలకు కారణమయిన అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువ బాధ్యత వహించాలన్న, 'సాధారణ కానీ

అవకలన బాధ్యత'  సిద్ధాంతాన్ని అమెరికా నేడు పక్కన పెడుతున్నది. అమెరికా వైదొలగడం భారతదేశంతో సహా  ప్రపంచ దేశాలన్నిటికి తీవ్రచిక్కులు తెచ్చిపెడుతుంది. అందువలన మనం మన వ్యూహాన్ని తిరిగి రూపొందించుకోవలసి ఉంటుంది.

## షాంఘాయ్ సహకార సంఘం

ఈ మధ్యనే భారతదేశం పాకిస్తాన్‌తో సహా షాంఘాయ్ సహకార సంఘంలో పూర్తికాల సభ్యురాలుగా చేర్చుకోబడింది (ఎస్‌సిఓ). ఈ ప్రాంతీయ సంఘంలో రష్యా, చైనా, భారతదేశానికి చెందిన 44% ప్రపంచ జనాభా ఉన్నది; ప్రపంచ స్థూల జాతీయ ఆదాయంలో 25% ఇందులోనే ఉన్నది. ఎస్‌సిఓ ప్రాథమికంగా ఒక లౌకిక సంఘటన. ప్రపంచంలోని తీవ్రవాదానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి వ్యతిరేకంగా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏర్పడ్డ కూటమి. తదనంతర కాలంలో ఇది వాణిజ్య, ఆర్థిక సాంకేతిక సహకారం చేసుకునేందుకు విస్తరించబడింది.

భారతదేశం మధ్యఆసియాలో అపారంగా ఉన్న ఇంధన, ఖనిజ వనరులను అందుబాటులోనికి తెచ్చుకోగలుగుతుంది. అయితే అమెరికాతో పెరుగుతున్న మిలిటరీ, వ్యూహాత్మక సహకారం, ఫలితంగా భారతదేశ  విదేశీ విధానంలో మారుతున్న దిశ, భవిష్యత్తులో ఎస్‌సిఓ తో భారతదేశ సంబంధాన్ని ప్రశ్నార్థకం  చేస్తున్నది. ఇంకొక విషయం ఏమిటంటే, చైనా ప్రతిపాదించిన 'వన్ బెల్ట్ వన్ రోడ్' లో 'ఎస్‌సిఓ' దేశాలన్నీ ఉండగా 'భారతదేశం మాత్రమే భాగస్వామి కాదు. ఇప్పుడు భారత–చైనా మధ్య తలెత్తిన ప్రతిష్టంభన నేపథ్యంలో భవిష్యత్‌లో  భారతదేశ భాగస్వామ్యంతో 'ఎస్‌సిఓ' ఎలా పనిచేస్తుందో వేచిచూడాలి.

# జాతీయం

గత సమావేశంలో ఉత్తర ప్రదేశ్‌లో, ఉత్తరాఖండ్‌లో బిజెపి గెలవడం, గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలు నెలకొల్పడంతో బిజెపి దేశంలో తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంది. అప్పటి నుండి అది సిబిఐ చే పరిశోధనలు చేయించడం, ప్రాంతీయ పార్టీలను బుజ్జగించడం, రాజకీయ మద్దతు మొత్తంగా కొనుక్కోవడం లాంటి పనులకు పూనుకుంటున్నది. టీఆర్ఎస్, ఏఐడిఎంకె రెండు గ్రూపులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ బాహాటంగా బిజెపికి రాష్ట్రపతి ఎన్నికలలో మద్దతు తెలిపాయి. నితీష్ కుమార్, నవీన్ కుమార్ కూడా వారి వారి అవసరాల రీత్యా మద్దతు ప్రకటించారు.

## నాలుగు చెరగులా దాడి ముమ్మరం

క్రితం కేంద్ర కమిటీ సమావేశం తరువాత బిజెపి ప్రభుత్వం అశేష ప్రజల జీవనాధారం పై అన్ని వైపులనుండి దాడి పెద్దఎత్తున చేయడం చూస్తున్నాము. నూతన ఆర్థిక విధానాలు అమలుచేయడం వలన అశేష ప్రజలు కష్టాలపాలవుతున్నారు. మతతత్వ కేంద్రీకరణలు పదునెక్కి మైనారిటీలు దళితులపై గోవు రక్షకులలాంటి ప్రైవేటు వ్యక్తుల దాడులు పెరిగాయి. పార్లమెంటరీ సంస్థల ప్రాముఖ్యతను తగ్గించబడుతున్నది. ప్రజల ప్రజాతంత్ర హక్కులపై ఆధిపత్య దాడులు పెరిగాయి. అమెరికాకి భారతదేశాన్ని ఒక జూనియర్ భాగస్వామిని చేసే క్రమం బలపడింది. ఫలితంగా మన దేశ విదేశాంగ విధాన దిశలో స్పష్టమయిన మార్పు కనిపిస్తున్నది. పొలిట్ బ్యూరో జూన్ 6 –7 తేదీలలో సమావేశం అయిన తరువాత మోడీ తన ప్రభుత్వం మూడేళ్ళ పాలన ముగించుకున్నందుకు సంబరాలు జరుపుకుంటున్న సందర్భంలో, ఆ ప్రభుత్వం భారత ప్రజలకిచ్చిన ఎన్నికల వాగ్దానాలను ఏ విధంగా భంగం చేసిందో నొక్కి వక్కాణిస్తూ ఒక వివరమైన అధికారిక ప్రకటన, ఒక చిన్న పుస్తకం పార్టీ విడుదల చేసింది. ఆ వివరాలు మళ్లీ ఇక్కడ చెప్పడం లేదు.

## మతతత్వ కేంద్రీకరణ పదునెక్కుతున్న వైనం

బిజెపి పెద్ద ఎత్తున మతతత్వ కేంద్రీకరణను పెంచడం ద్వారానే దేశంలో తన స్థానాన్ని సుస్థిరపరచుకొనగలిగింది. ప్రతి పార్లమెంటరీ ప్రజాస్వామిక సంస్థలోకి చొచ్చుకునిపోయి మతతత్వంతో నింపే ప్రయత్నం చేసింది. మతతత్వకేంద్రీకరణను పదును పెట్టి, చరిత్రను తిరగ వ్రాసేందుకు విద్య, ఆర్చియాలజి అఫ్ ఇండియా లాంటి పరిశోధన సంస్థలలోకి ఆర్ఎస్ఎస్‌కి సంబంధించిన వ్యక్తులు చొచ్చుకునిపోతున్నారు. అందరికి చెందాల్సిన స్థలాలన్నింటిని ఆక్రమించుకునేందుకు మతతత్వంతో నింపేందుకు వెర్రెత్తినట్టు ప్రయత్నిస్తున్నారు. ఇది దాడులకు ముందు ప్రజాతంత్ర లౌకికవాదులను భయభ్రాంతులను చేయడానికి దారితీస్తున్నది. ఇది మన దేశానికే పెద్ద సవాలు.

## దళితుల పైన మైనార్టీల పైన దాడులు

గత కేంద్ర కమిటీ సమావేశం తరువాత గో రక్షకసమితిలు పేరిట ప్రయివేటు సైన్యాలు చేసే హత్యలు విపరీతంగా పెరిగాయి.

ఢిల్లీ పరిసర ప్రాంతాలలో ఒక లోకల్ రైలులో ముస్లిం కుటుంబంపై జరిగిన దాడివలన జునైద్ అనే 15 ఏళ్ల విద్యార్థి మరణించగా అతని అన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. అతని మరో సోదరుడికి కూడా గాయాలయ్యాయి. ఈ మధ్యలో జరిగే దాడులు ఒక పథకం ప్రకారం జరుగుతున్నాయని తెలియచేస్తున్నాయి. బిజెపి తన ఎన్నికలలో విజయావకాశాలను మెరుగుపరుచుకునేందుకు మతతత్వ కేంద్రీకరణకు పదునుపెడుతున్నది. ఈ రకమయిన దాడులకు, నైతిక రక్షకులుగా చెప్పుకుంటున్న గ్రూపుల పట్ల దేశవ్యాప్తంగా వ్యతిరేకత, పెరుగుతున్నది. ఈ ఘటనలు తీవ్ర స్థాయిలకు చేరుతున్న దృష్ట్యా, వీటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే ప్రయత్నం చేయాలి.

సిపిఐ(ఎం) గో రక్షక్ సమితిలు లాంటి ప్రైవేటు సైన్యాన్ని కేంద్రంలోనే నిషేధించాలని డిమాండ్ చేసింది. బిజెపి ద్వంద్వ వైఖరి ఇక్కడ మరోమారు బయటపడుతున్నది. ఈశాన్యభారత దేశంలోను, గోవాలోను వారి ముఖ్యమంత్రులు తమ తమ రాష్ట్రాలలో గొడ్డు మాంసమే అక్కడి ప్రజల సాంప్రదాయకమైన ఆహారం అయినందువలన, తమ ప్రభుత్వాలు గొడ్డుమాంసం కొరత లేకుండా చర్యలు తీసుకుంటాయని భరోసా నిచ్చారు.

# పశు విక్రయాలపై నిషేధం

పర్యావరణ, అడవులు మరియు పర్యావరణ మార్పు మంత్రిత్వ శాఖ పశువుల విక్రయాన్ని వధించేందుకు అమ్మకూడదని నిషేధం విధిస్తూ నోటిఫికేషన్ జారీ చేయడం మోడీ ప్రభుత్వం తన ఈ దేశంలో ఆహారపు కోడ్‌ను అమలు చేయాలన్న దారుణమైన పూర్తి మతతత్వ , విభజిత అజెండాకు ఒక చట్టంపైపూత వేసే ప్రయత్నం మాత్రమే.

ఇది కోట్లాది రైతుల జీవనాధారాన్ని నాశనం చేస్తుంది. సాంప్రదాయక పశు సంతలను తొలగించి వేస్తుంది. అన్యాయంగా పనికిరాని పశువుల రక్షణ భారాన్ని రైతులు మోయవలసి వస్తుంది. ఇందువలన అసలే పెట్టుబడుల భారంతో కుదేలవుతూ ఆత్మహత్యలకు ఒడిగడుతున్న రైతులపై మరింత భారం పడుతుంది. దీని ప్రభావం చర్మ పరిశ్రమపైన, మాంసం ఎగుమతి పరిశ్రమపైన కూడా పడి లక్షలాది ప్రజల జీవనాధారాలకు ముప్పు ఏర్పడుతుంది. ఈ విషయాలు రాష్ట్రాల పరిధిలోనివి కాబట్టి ఈ నోటిఫికేషన్ కేంద్రమివ్వడమంటే రాష్ట్రాల పరిధిలోకి కేంద్రం చొచ్చుకుపోవడమే .

మద్రాస్ హై కోర్ట్ స్టే ఇచ్చినందు వలన సుప్రీమ్ కోర్ట్ కూడా ఈ నోటిఫికేషన్ పై స్టే నిచ్చింది. బిజెపి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో మార్పులు చేసి తీసుకుని వస్తామని సుప్రీమ్ కోర్టుకు తెలియచేసింది. అసలు నోటిఫికేషన్ అవసరం లేదు. ఏ రకమయిన మార్పులకు అవకాశం కూడా లేదు. ఈ నోటిఫికేషన్‌ని పూర్తిగా ఉపసంహరించుకోవలసినదే. మహిళలపై దాడులు 'మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టడానికి మోడీ ప్రభుత్వం నిరాకరిస్తుంది. ఆర్ఎస్ఎస్ ఈ బిల్లు కుటుంబాలను 'విచ్ఛిన్నం' చేస్తుందన్న పేరుతో దీనిని ఎప్పటినుండో వ్యతిరేకిస్తున్నది. బిల్లును ఈసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని సిపిఐ (ఎం) డిమాండ్ చేస్తున్నది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు వ్యతిరేకంగా అనేక రాష్ట్రాలలో ప్రదర్శనలకు దారితీసాయి. ఉత్తరప్రదేశ్‌లో ఆదిత్యనాథ్ నాయకత్వంలో రోమియో వ్యతిరేక బృందాలు ఏర్పడిన చోట, క్రితం సంవత్సరం మార్చ్–ఏప్రిల్ లో 41 అత్యాచారాలు నమోదు కాగా ఈ ఏడు 179 నమోదయ్యాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో ఒక బడికి వెళ్లే అమ్మాయి అత్యాచారం చేయబడి హత్య చేయబడినందు వలన అక్కడ ఇంకా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. రాయిగంజ్‌లో టిఎంసి నేరస్తులు ఇద్దరు, మైనర్ ఆదివాసీ ఆడపిల్లలను వారి ఆఫీస్‌లోనే అత్యాచారం చేయడంతో వెనువెంటనే పెద్ద నిరసనలు

వెల్లువెత్తి ఆఫీస్ దగ్ధం చేయబడింది. కేంద్ర ప్రభుత్వం వర్మ కమిటీ సిఫార్సులను అమలుచేయడానికి తిరస్కరిస్తున్నది. నిర్భయ నిధులు ఉపయోగించకుండా ఉండిపోవడం సిగ్గుచేటు. రాజకీయ నాయకులూ ఈ కేసులలో ఉండడం, ఈ మధ్య కేరళ ఎంఎల్ఏ విన్సన్ట్ ఒక అత్యాచార కేసులో ఆరోపణలు ఎదుర్కొని అరెస్ట్ చేయబడ్డం, రాజకీయాలు దిగజారడానికి నిదర్శనంగా ఉన్నాయి. సిపిఎం వర్మ కమిటీ సిఫారసులు అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నది.

## ప్రసార మాధ్యమాల పాత్ర

అధికార ప్రసార మాధ్యమాలన్నీ దాదాపుగా కేంద్ర ప్రభుత్వం తన అదుపులోనే ఉంచుకుని, కేవలం మోడీ చెప్పినవే ప్రసారం జరిగేటట్టు చూస్తున్నది. ప్రయివేటు ప్రసార మాధ్యమాలు పెద్ద పెద్ద కార్పొరేట్ల అధీనంలో ఉన్నది. ప్రభుత్వం కార్పొరేట్లు కలిసి ఆర్ఎస్ఎస్ బిజెపిలు నిర్దేశించినవే ముఖ్యమయిన ప్రసారాలలో వచ్చేటట్టు చూసుకుంటున్నారు.

## హిందీని విధిగా ఆమోదింపచేయడం

ఇది ఆర్ఎస్ఎస్ నినాదమయిన 'హిందీ, హిందూ, హిందూస్తాన్' కి అనుగుణంగా ఉన్నది. ఆర్ఎస్ఎస్ రాజకీయ పార్శ్వం బిజెపి, వారి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు హిందీని దేశవ్యాప్తంగా తప్పనిసరిగా బోధించడం, నేర్చుకోవడం జరగాలని బలవంతం చేయ ప్రయత్నిస్తున్నది. ఇది గుర్తింపు పొందిన అన్ని ప్రాంతీయ భాషల గ్రూప్‌లు సమాన హక్కులు కలిగి ఉన్నాయన్న మన రాజ్యాంగ నిబంధనలకు స్పష్టమైన ఉల్లంఘన. ఇది మతతత్వ కేంద్రీకరణను పదునుపరిచి హిందూత్వ ఎజెండాను మరింత ముందుకు తీసుకునిపోయే మరో ప్రయత్నం.

## భారతదేశ ఆర్థిక పరిస్థితి

## ప్రజలపై పెరుగుతున్న భారాలు

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా దిగజారుతూనే ఉంది. నోట్ల రద్దు వలన ఏర్పడ్డ గందరగోళం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. దాని వలన ఏర్పడ్డ ఆర్థిక విచ్ఛేదనము మరింత నిరుద్యోగం పెరగడానికి దారితీసింది; అశేష ప్రజానీకాన్ని ఆర్థిక అభద్రతలోకి నెట్టివేసింది.

## వ్యవసాయ సంక్షోభం

ఈ కాలంలో వ్యవసాయ సంక్షోభం పెరిగిపోయింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో యాధృచ్ఛికంగాను సంఘటితం చేసినందువలన రైతులు ఎన్నో నిరసనప్రదర్శనలు చేసారు. రైతులలో పెరుగుతున్న ఆత్మహత్యలు ఈ నిరసనలకు దారితీసాయి. మధ్యప్రదేశ్‌లోని మండ్సర్ లో నిరసన ప్రదర్శకులపై కాల్పులు, మహారాష్ట్రలో రైతులు చేసిన సాధారణ సమ్మె దాదాపు ఒకే కాలంలో జరిగి వ్యవసాయ విపత్తుల సమస్యలను దేశం దృష్టికి తెచ్చాయి. 'వ్యవసాయ ఖర్చులు–ధరలు' లాంటి ఒక ప్రభుత్వ ఏజెన్సీ నిర్ణయించిన ఉత్పాదక ధరకు ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధరను వ్యవసాయ ఉత్పత్తులకు నిర్ణయిస్తామన్న మోడీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం నెరవేర్చకుండా మోసం చేసారు. మూడేళ్ళ ఈ నమ్మక ద్రోహం కారణంగా, పై విధంగా నిర్ణయించబడిన కనీసమద్దతు ధరకు అనుగుణంగా రైతు తన పంటకు ధరను నిర్ణయించుకునేటట్టు రైతులకు హక్కులను కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. అంటే రైతు పంటను అమ్మడానికి తెచ్చినప్పుడు ప్రభుత్వం చట్ట ప్రకారం ఇవ్వాల్సిన కనీస మద్దతు ధరను చెల్లించి పంటను సేకరించి తీరాలి.

## పెరుగుతున్న నిరుద్యోగం

నోట్ల రద్దుతో ఆర్థిక రంగంలోని అసంఘటిత రంగం కుదేలయి రోజువారీ లేదా వారం వారం వేతనాలతో పనిచేసే అశేష ప్రజలు వీధులపాలయ్యారు. సంఘటిత రంగంలో కూడ ఉద్యోగాలు తగ్గాయి. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ గత కేంద్ర కమిటీ తరువాత ప్రకటించిన లెక్కల ప్రకారం జనవరి – ఏప్రిల్ 2016 నుండి జనవరి – ఏప్రిల్ 2017 లోపు అధికారిక ఉద్యోగిత 9.3 కోట్లనుండి 8.6 కోట్లకు పడిపోయింది. అంటే 70 లక్షల ప్రజలు ఇదివరకు ఉద్యోగాలలో ఉన్నవారు కూడా ఉద్యోగాలను కోల్పోయారు. క్రితం సమావేశంలో చెప్పుకున్నట్టు మహాత్మాగాంధీ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ నిధులలో కోత కొనసాగుతూనే ఉన్నది. అంటే గ్రామీణ ఉద్యోగిత కూడా తగ్గుతున్నదన్నమాట. సేవారంగంలో కూడా కొత్త ఉద్యోగాలు ఏమీ కల్పించబడలేదు.

ఫెడరేషన్ అఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఈ మధ్యనే నిర్వహించిన సర్వే ప్రకారం , ప్రశ్నించిన వారిలో 73% మంది తాము రాబోయే మూడు నెలలలో అదనంగా ఎవరినీ నియమించుకోబోవడం లేదని సమాధానం చెప్పారు.

భారతదేశంలో చదువుకుని నైపుణ్యం సంపాదించుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువకులకు ఈ రంగంలో ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఏమాత్రం లేవు. ఐటీ రంగం కూడా మాంద్యాన్ని ఎదుర్కొంటున్నది. ఫలితంగా ఉద్యోగాలు పోవడమేకాదు, భవిష్యత్తులో కూడా ఉద్యోగాలు పెరిగే అవకాశాలు అంటూ లేవు. రోబో లాంటి ఆధునిక టెక్నాలజీ కూడా మానవులు చేసే పనులను చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తానని మోడీ ప్రభుత్వం ఎన్నికలలో వాగ్దానం చేసింది. ఇప్పుడు పెద్ద ఎత్తున ఉన్న ఉద్యోగాలే తరిగిపోతున్నాయి. ఏడాదికి 1.5 కోట్ల యువకులు కొత్తగా ఉద్యోగాల మార్కెట్‌కు చేరుతున్న తరుణంలో ఇది యువతలో తీవ్ర అశాంతిని పుట్టిస్తుంది.

## ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ

నీతిఅయోగ్ సిఫారసులకు అనుగుణంగా బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు పూనుకుంటున్నది. నీతిఅయోగ్ కార్పొరేట్ల హస్తాలలో చిక్కుకుని ఉన్నది. దాని సిఫారసులు అన్నీ నయాఉదారవాద ఆర్థిక సంస్కరణలకు అనుగుణంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, జాతీయ బడా కార్పొరేట్లు చేస్తున్న సూచనలకు అనుగుణంగానే ఉన్నాయి. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయడమంటే నయాఉదారవాద ఆర్థిక సంస్కరణలకు తీవ్రంగా అమలు చేస్తూ, అంతర్జాతీయ, జాతీయ బడా కార్పొరేట్లకు ప్రజల ఆస్తులను కారుచవకగా అప్పచెప్పడమే.

ఆయుధ తయారీ కేంద్రాలను ప్రయివేటీకరించడానికి పెద్ద కసరత్తు జరుగుతున్నది. ఆయుధ పరికరాలను కార్పొరేట్లకు అప్పచెప్పడమంటే విదేశీ ఆయుధ తయారీ సంస్థలకు పెద్ద ఎత్తున లాభాలను సమకూర్చడమే కాకుండా భారత దేశరక్షణకు కూడా ముప్పుతెచ్చిపెట్టడమే. భారతదేశ జీవనది లాంటి భారత రైల్వేస్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్నాయి. రైల్వేస్‌కి సంబంధించిన అనేక సేవలు ఇప్పటికే ప్రైవేటుపరం చేయబడ్డాయి. ఇది తమ ప్రయాణాలకు, జీవనానికి, రాకపోకలకు ఆధారమయిన అశేష భారత ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతుంది.

ఆర్థిక రంగంలో ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త ఎఫ్ఆర్‌డిఏ చట్టం అమలయితే బ్యాంకులు ఇతర ఆర్థిక సంస్థలపై ఏ రకమయిన ప్రజల పరిశీలనా, సామాజిక నియంత్రణ ఉండవు. ఇది కూడా అశేష ప్రజలకు హాని కలిగిస్తుంది. ఎయిర్ ఇండియాకి రియల్ ఎస్టేట్

ఆస్తులు, ఇతర ఆస్తులు, చిత్రలేఖనాలు అనేకం ఉన్నాయి. ప్రైవేటీకరించే పేరుతో వీటిని ప్రైవేట్ పెట్టుబడికి లాభాలను చేకూర్చేందుకు అప్పచెప్పాలని ప్రభుత్వం అనుకుంటున్నది.

ఈ ప్రైవేటీకరణ సామాజిక న్యాయానికి పాతరవేసి ఉన్న కొద్దిపాటి ఉద్యోగ అవకాశాలు ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి లకు లేకుండా చేస్తుంది. కార్మిక వర్గం ట్రేడ్ యూనియన్లు, ప్రజల ఆస్తులను అమ్మి కార్పొరేట్ల బొక్కసాలు నింపాలనుకునే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలకు పిలుపులిస్తే పార్టీ వారికి మద్దతు ప్రకటించేందుకు సిద్ధంగా ఉండాలి.

## జిఎస్‌టీ

జులై 2017 నుండి అమలు అయిన జిఎస్‌టీ ప్రతికూల ప్రభావాల పట్ల కేంద్ర కమిటీ తీవ్ర ఆందోళన చెందుతున్నది. జిఎస్‌టీ సాధారణ ప్రజానీకంపై, చిన్న వ్యాపారులపై, పరిశ్రమలపై, అసంఘటిత కార్మికులపై మరింత భారాన్ని మోపనుంది. పరిశ్రమలు, చేనేత, బీడీ, మందుల తయారీ, మందుగుండు సామానులు, ఉత్పత్తి, రవాణా, నిర్మాణం, చిన్న చిన్న వార్తా పత్రికలూ, అగ్గిపెట్టెలు మొదలయిన పరిశ్రమలు నష్టపోతాయి. వ్యవసాయం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపైన కూడా దీని ప్రభావం ఉంటుంది. జిఎస్‌టీ ఎన్నో వస్తువుల ధరలు తగ్గిస్తుందని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవంలో దుర్మార్గమయిన పన్ను విధానం వలన ఎక్కువ వస్తువుల ధరలు పెరుగుతాయి. జిఎస్‌టీ ఇప్పుడు అమలవుతున్న పద్ధతిలో మోడీ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల కొనసాగింపే. జిఎస్‌టీ విధానం కార్పొరేట్లకు అనువుగా మలచబడింది. పన్నులు తగ్గినందువలన ధరలు తగ్గినవి ప్రజలకు చేరనీయలేదు. అందువలన కార్పొరేట్లకు లాభాల పంట పండింది. ముఖ్యంగా వికలాంగుల అవయవాలపై వేసిన 5% పన్ను, మహిళల సానిటరీ నాప్కిన్స్‌పై వేసిన 12% పన్ను, ఏసి, ఏసి కానీ ఆహార సరఫరా కేంద్రాలలో వేసే 12,18% పన్నులు, అత్యవసర మందులపై వేసే 18% పన్ను ఎంతో అన్యాయమైన రేట్లు. మధ్య తరగతి మహిళలు వాడే సిల్క్ చీరలు, కృత్రిమ నారపై వేసిన 18% పన్ను వలన ప్రియమౌతాయి.

జిఎస్‌టీ బొగ్గు కాక ఇతర ఖనిజ తవ్వకాలపైన, బీడీ, సినిమా తదితర రంగాలపై వేసే సంక్షేమ సెస్‌లను వేయనీయకుండా చేసింది. ఇందువలన సంక్షేమ, సామాజిక రక్షణకు సంబంధించిన ఆయా రంగాలలోని కార్మికుల సంక్షేమ హక్కులను తొలగించింది. స్వచ్ఛ

ఇంధనం, కార్బన్ పన్ను కూడా ఎస్‌జిఎస్‌టీకి మరల నున్నాయి. ఇది స్వచ్ఛమైన ఇంధన అభివృద్ధిని కుంటుపరుస్తుంది. 20 లక్షల కన్నా ఏడాదికి ఎక్కువ అమ్మకాలున్న చిన్న వ్యాపారాలు రిటర్న్లు దాఖలు చేయవలసి రావడం వలన వారు చెల్లించిన పన్నులు తిరిగి రాబట్టుకోవడం, వ్యాపారం చేయడం కష్టం అవుతుంది. వినిమయ సరులకు ధరలు పెరిగే అవకాశాలు ఉండడంతో మొత్తంగా ధరలు పెరుగుతాయి. జిఎస్‌టీ వలన రాష్ట్రాల ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతింటుంది. రాష్ట్రాల హక్కులకు భంగం కలుగుతుంది. జిఎస్‌టీ కౌసిల్ వెంటనే వేయాలని అందులో జిఎస్‌టీ పన్నులను సంపూర్ణంగా సమీక్షించి, అనవసరంగా అన్యాయంగా వేసిన పన్నులను తగ్గించడం లేదా తొలగించడం చేయాలనీ సిపిఎం కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఉదాహరణకు వికలాంగులు ఉపయోగించే పరికరాలపై వేసిన పన్ను తొలగించాలి. డ్రగ్ ప్రైస్ కంట్రోల్‌లో ఉన్న జాతీయ అత్యవసర మందుల చిట్టాలోని అత్యవసర మందులపై జిఎస్‌టీ ఉండకూడదు. సానిటరీ నాప్కిన్స్ పై పన్ను ఉండకూడదు. వ్యాపారులు తమ అమ్మకాలపై జిఎస్‌టీ రిటర్న్ దాఖలా చేయాల్సిన పరిమితి ఇప్పుడున్న 20 లక్షలనుండి మరింతగా పెంచాలి. జిఎస్‌టీ కౌసిల్ ను పార్లమెంట్ పర్యవేక్షణ కిందికి తేవాలి. జిఎస్‌టీ నెట్వర్క్, సిఏజి (కాగ్), ఆర్‌టిఐ పరిధిలోనికి తేవాలి. జిఎస్‌టీ అమలయిన దగ్గరినుండి వివిధ రంగాలలోనివారు దానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడాన్ని కేంద్ర కమిటీ గుర్తించింది. పార్టీ యూనిట్లు నిరసన కార్యక్రమాలు చేస్తున్న, పోరాడుతున్న రంగాలకు పార్టీ మద్దతు ప్రకటించి వారి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని జిఎస్‌టీ ఆయా రంగాలపై పడిన భారాలు తొలగించే విధంగా గట్టి చర్యలు తీసుకోవాలని కేంద్ర కమిటీ పిలుపునిస్తున్నది.

## ప్రజా పోరాట వేదికలు

క్రితం కేంద్ర కమిటీలోని చర్చల ఆధారంగా వామపక్ష పార్టీలతోనూ వారి ప్రజాసంఘాలతోను చర్చలు జరుగుతున్నాయి. గత కేంద్ర కమిటీ సమావేశంలో సిపిఐ కి, సిపిఐ( ఎం ఎల్) యొక్క ప్రజా సంఘాలతో, ఎస్‌యూసిఐ కలిసి ఒక వేదికలో పనిచేయడానికి ఉన్న అయిష్టత, సమస్యలను చర్చించాము. ఆ సమస్యలు తరువాతి కాలంలో తొలగిపోయి అందరి ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటుచేయడం జరిగింది. డిమాండ్ చార్టర్‌ను తయారుచేసేందుకు ఒక చిన్న కమిటీ వేయాలనుకున్నాము. ఢిల్లీలో ఆగష్టు చివరిభాగంలో గాని సెప్టెంబర్ మొదటిభాగంలోగాని ఒక జాతీయ సదస్సు ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసుకుంటున్నాము.

## ఆధార్, వ్యక్తిగత గోప్యత హక్కు

సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇప్పుడు వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కా కాదా అని చర్చిస్తున్నది. బిజెపి ప్రభుత్వం వ్యక్తిగత గోప్యత హక్కుకు తగిన పరిమితులు ఉండాలని, ఆధార్‌లోని వ్యక్తిగత వివరాలకు సంబంధించిన సమాచారం, ప్రభుత్వానికి కొన్ని పరిస్థితులలో ఖచ్చితమయిన కారణాలకు అందుబాటులో ఉండాలని వాదిస్తున్నది. ఇక్కడ వ్యక్తిగత గోప్యతకు ప్రభుత్వం భంగం కలిగిస్తున్నాదా లేదా అన్నది ప్రశ్న కాదు. ఉదాహరణకి ఉగ్రవాదాన్ని అణచడానికో, దేశరక్షణకో అనుకుందాము. అయితే ఈరోజు ప్రపంచ కార్పొరేట్లు వ్యక్తుల వివరాలను అనేక రకాలుగా ఉపయోగించుకుని వారిని వేధింపులకు గురిచేస్తున్నాయి. ఈ రకమయిన కార్పొరేట్ వేధింపుల నుండి ప్రతి వ్యక్తిని కాపాడవలసిన అవసరం ఉంది. అందువలన మనం ప్రభుత్వాన్ని వ్యక్తుల గోప్యతకు భద్రత కల్పిస్తూ కొత్త చట్టం చేయాలనీ, దానిని భంగపరిచిన వారికి శిక్షపడే విధంగా చట్టంలోని భాగాలు ఉండాలని డిమాండ్ చేస్తున్నాము. ఇందుకు ఉదాహరణే మొన్న జిఓ ఆధార్‌లోని వివరాలన్నింటినీ తన వెబ్సైట్‌లో పెట్టడం.

## త్రిపుర

క్రితంసారి కేంద్ర కమిటీలో చెప్పుకున్నట్టుగానే బిజెపి, ఆర్ఎస్ఎస్ లు త్రిపురలో వామపక్ష సంఘటన ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోనికి రానీయకుండా ఆపాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ముందుగా ఊహించినట్టుగానే వారు గిరిజనులు గిరిజనేతరులు అని ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఒక విధంగా ఐపిఎఫ్టి ని జాతీయ రహదారులను, రైల్వేలను దిగ్బంధనం చేయడానికి రెచ్చగొడుతున్నారు.

బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సిబిఐ, తాను పరిశోధిస్తున్న చిట్‌ఫండ్ కంపెనీ యొక్క కొన్ని ప్రకటనలను వేసినందుకుగాను పార్టీపత్రిక 'దేషర్ కథ' వేదిస్తున్నారు. అదే ప్రకటనలను ఇతర పత్రికలు వేసినా కేవలం మన పత్రికనే వారు వేదిస్తున్నారు. అందువలననే త్రిపురలో సిపిఎం నే లక్ష్యంగా చేసుకున్నారని అనవలసి వస్తున్నది.

త్రిపుర రాష్ట్ర కమిటీ ఈ సంయుక్త దాడిని ఎదుర్కొనేందుకు వివరంగా చర్చించి పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడానికి పూనుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ బలహీన పడింది. టిఎంసి లోకి మారిన ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్ఏ లు మొన్నటి రాష్ట్రపతి ఎన్నికలలో

బిజెపి అభ్యర్థికి ఓటు వేశారు. వారు బిజెపి లో చేరవచ్చు. ఇతర ప్రదేశాలలోలాగానే ఈ రాష్ట్రంలోకూడా కొన్ని చోట్ల బిజెపి సిపిఎం కార్యకర్తలపై దాడులు చేయడం మొదలుపెట్టింది.

ఇదే సందర్భంలో భారత దేశ ప్రభుత్వ గణాంకాల ప్రకారమే భారతదేశం లో విద్య ఆరోగ్యం సూచికలు అత్యుత్తమంగా ఉన్న రెండు రాష్ట్రాలు, ఒకటి కేరళ రెండవది త్రిపుర. త్రిపురలో 96% అక్షరాస్యులు, ఆయుష్ ప్రమాణం మగవారిలో 71 సంవత్సరాలు, స్త్రీలలో 73 సంవత్సరాలు. ఈ రెండు సూచికలలో ఇది దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. ఈ ప్రజా అనుకూల అభివృద్ధి కాముక విధానాలు అనుసరిస్తున్న సిపిఎం, వామపక్ష ప్రభుత్వం పైనే బిజెపి ఎక్కుపెడుతున్నది.

## కేరళ

కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినదగ్గరి నుండి ఆర్ఎస్ఎస్ దాడులలో 13 మంది కామ్రేడ్స్ హతులయ్యారు; 200 మందికి పైగా కార్యకర్తలకు గాయాలయి ఆసుపత్రులపాలయ్యారు. 150కి పైగా ఇళ్ళు, దాదాపు 50 పార్టీ ఆఫీసులు దాడికి గురయ్యాయి, అగ్నికి ఆహుతి చేయబడ్డాయి లేదా విధ్వంసానికి గురయ్యాయి. యుడిఎఫ్ ప్రభుత్వ హయాంలో 27 మంది కామ్రేడ్లు ఆర్ఎస్ఎస్ చేతిలో హతులయ్యారు. అటువంటి దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అదేసమయంలో ఆర్ఎస్ఎస్, వారి హత్యలను హింసను కప్పిపుచ్చుకునేందుకు సిపిఎం పై దుర్మార్గాలకు పాల్పడుతున్నదంటూ ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు.

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఈ తక్షణ సమస్యను ఎదుర్కొనేందుకు నాలుగు రకాల కార్యక్రమాలను సఫలీకృతంగా అమలుచేసింది. 1. జీవితం – ఇళ్ళు లేని వారికి ఇళ్లు నిర్మించడం. 2. ఆర్ద్రం – పూర్తిగా ఆరోగ్య అవసరాలు తీర్చే పథకం. – ప్రజా విద్య వ్యవస్థను రక్షించేందుకు పెద్దఎత్తున కార్యక్రమం తీసుకున్నాము. 4. హరిత కేరళ – పూర్తి పరిశుభ్రత, సహజ వ్యవసాయం. నదులను నీటికుంటలను సరస్సులను కాపాడుకోడానికి ఒక ప్రత్యేక కార్యక్రమం తీసుకున్నాము. దీనిని అందరూ ప్రశంసిస్తున్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పనిచేసే నర్సులకు రూ. 20,000/– నెల జీతం నిర్ణయించింది. అన్ని రంగాలలోని కార్మికులకు రూ. 600/– దినసరి వేతనంగా నిర్ణయించింది. రెసెర్వెడ్ క్యాటగిరిలో ఉద్యోగాల నియామకాలకు ఉపయోగించే రోస్టర్ పద్ధతిలో మొదటి

స్థానం అంగవైకల్యం ఉన్నవారికే దక్కుతుంది. ఆ తరువాత మిగిలిన వారికి కేంద్ర చట్టం, వికలాంగుల హక్కుల చట్టం 2016 కి అనుగుణంగా వికలాంగుల రిజర్వేషన్లను 4% నికి పెంచింది ప్రభుత్వం. స్థానిక సంస్థలలోని బై ఎలక్షన్స్ లో 86 స్థానాలకుగాను ఎల్‌డిఎఫ్ 51 స్థానాలను కైవశం చేసుకుంది. యుడిఎఫ్ కి 24, బిజెపికి 9 కేసి కి 2 వచ్చాయి. ఇంకో పరిణామం బిజెపి సీనియర్ నేత అవినీతి కేసులో ఇరుక్కున్నాడు. ఒక మెడికల్ కాలేజికి అభ్యంతరం లేదన్న సర్టిఫికెట్ తెచ్చుకునేందుకు లంచం ఇచ్చి పట్టుబడ్డాడు. ఇంకో బిజెపి నాయకుడు నకిలీ నోట్లను ముద్రిస్తున్న కేసులో అరెస్ట్ చేయబడ్డాడు.

## పశ్చిమ బెంగాల్

బిజెపి పశ్చిమ బెంగాల్‌లోని వివిధ ప్రాంతాలలో ప్రవేశించడానికి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నది. మత సంబంధిత ఉత్సవాలలో పాల్గొనేటప్పుడు బడి పిల్లలచేతికి ఆయుధాలను ఇచ్చి మతతత్వాన్ని కేంద్రీకరించే కార్యక్రమాలను ముమ్మరం చేసింది. బిజెపి తృణముల్ కాంగ్రెస్ జోడెద్దులలాగా రాష్ట్రంలో పనిచేస్తున్నాయి. వారు మతతత్వాన్ని పెంచడంలో పోటీపడుతున్నారు. దీని పర్యవసానాలు తీవ్రంగా ఉండబోతాయి. నాలుగు దశాబ్దాల తరువాత రాష్ట్రంలో కొన్ని ప్రదేశాలలో మతతత్వ అల్లర్లు చెలరేగాయి. టిఎంసి ముస్లిం మతోన్మాదుల కార్యకలాపాలకు ప్రత్యక్షంగా సహాయపడుతుండడంవలన, ఇది ఆర్‌ఎస్ఎస్ బిజెపి లు హిందూ మతతత్వ కార్యకలాపాలను ముమ్మరం చేయడానికి దోహదం చేసింది. ఈ రకమయిన మత కేంద్రీకరణల పర్యవసానం ఒక్క పశ్చిమ బెంగాల్ పైన మాత్రమే కాదు, దాని పొరుగున ఉన్న ప్రాంతాలపైనా ఉంటుంది. ఈ రకమయిన మతతత్వ పోటీతో టిఎంసి, బిజెపి లు వామపక్షాలను ముఖ్యంగా సిపిఎంను పశ్చిమ బెంగాల్ రాజకీయాలనుండి శాశ్వితంగా తప్పించవచ్చని ఆశపడుతున్నాయి. రాష్ట్రములోని వివిధ ప్రాంతాలలో సిపిఎం పై టిఎంసి దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మన పశ్చిమ బెంగాల్ కామ్రేడ్లు ఈ దాడులను ఎంతో ధైర్యంతో ఎదుర్కొంటున్నారు; సవాళ్ళను ఎదుర్కొంటున్నారు.

## డార్జిలింగ్

బెంగాలీ భాషను తప్పనిసరిగా చదవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జూన్ 8 వ తేదినుండి నేటి వరకు జరిగిన ప్రదర్శనలలో ప్రదర్శకులపై జరిగిన పోలీస్ కాల్పులలో 8 మంది చనిపోగా ఎంతో మంది గాయాలపాలయ్యారు. వాస్తవిక ఆర్థిక దిగ్బంధనం కారణంగా

మానవ హక్కులకు తీవ్రంగా భంగం కలుగుతున్నదని  వార్తలు వస్తున్నాయి. ఎంతో అవసరమయిన వారుకూడా వైద్య సేవలు పొందలేకపోతున్నారు. 'గోర్ఖ ప్రాంత పరిపాలన' జిటిఏ చట్టం మార్చ్ 14, 2012 ప్రకారం గజిట్ నోటిఫికేషన్ ద్వారా చేయబడింది. దీనికి దేశ రాష్ట్రపతి ఆమోదం కూడా ఉంది. శాంతి స్థాపన జరగాలంటే చర్చలు ప్రారంభం కావాలి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, గుర్ఖా జనముక్తి మోర్చా కలిసి జీటిఏ ని రూపొందించాయి. నానాటికి దిగజారుతున్న పరిస్థితులు, మానవ హక్కుల నిరాకరణ, ఈ ప్రాంత ప్రజలు కష్టాలకు గురికావడం వలన వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి. శాంతి స్థాపన జరగడానికి, సాధారణ పరిస్థితి నెలకొనడానికి చర్చలోకటే  మార్గం, అందుకు  వెనువెంటనే  జిటిఏని రూపొందించిన ముగ్గురు భాగస్వాములతో సంప్రదింపులు జరగాలి అన్నది స్పష్టం.

ఈ ప్రాంతంలో శాంతి స్థాపించడానికి , సాధారణ పరిస్థితి నెలకొల్పడానికి వెంటనే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యమ  నాయకుల ప్రతినిధులు సమావేశమవ్వాలి.

## కాశ్మీర్

కాశ్మీర్‌లో పరిస్థితి మరింత దిగజారింది. భారతదేశ రాష్ట్రాలనుండి కాశ్మీర్ ప్రజలు వేరుపడడం దాదాపు పూర్తయినట్టు కనిపిస్తున్నది. బిజెపి ప్రభుత్వం దీనిని కేవలం శాంతి సమస్యగానే చూస్తున్నది. కానీ వారి మనసు విరిగిపోవడానికి కారణాలు వెదకడం లేదు. బిజెపి ప్రభుత్వం కాశ్మీర్ ప్రజలకు పార్లమెంటులో ఇచ్చిన వాగ్దానాలను గాని,  హోమ్ మంత్రి ఆధ్వర్యంలో భారతదేశం పార్లమెంట్లోని  అన్ని పార్టీల  బృందం కాశ్మీర్‌లో పర్యటన చేసిన తరువాత  కాశ్మీర్ ప్రజలకిచ్చిన వాగ్దానాలను గాని  అమలు చేయలేదు. వెను వెంటనే పెల్లెట్ గన్స్ వాడకాన్ని నిలిపివేసి కాశ్మీర్ ప్రజలు నమ్మకాన్ని పొందుతామని ప్రభుత్వం ప్రకటించింది. వెంటనే  కాశ్మీర్ యువతకు ఉద్యోగాల  కల్పనకు చర్యలు చేపడతామని అన్నారు. సంబంధిత తరగతులలో చర్చలు ప్రారంభిస్తామని వాగ్దానం చేసారు. ఆరు నెలలయినా ఇవేవి ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. ఇది కాశ్మీర్ ప్రజలను మరింతగా దూరం చేయడానికి దోహదం చేసింది .

అమర్నాథ్ యాత్రికుల మీద దాడిని దేశం మొత్తం ఖండించింది. అన్ని తరగతుల జమ్మూ కాశ్మీర్ ప్రజలు ఖండించారు. ప్రభుత్వం ముందే  అందిన సమాచారం ఉన్నా, చారులు విషయ సేకరణ ఉన్నా,  ఎందుకు తగిన చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు, రకరకాల

రక్షణ వైఫల్యాలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతున్నది. ఇటువంటి పరిస్థితులలో మనం భాగస్వాములందరిని కలుపుకుని చర్చలు జరిపేందుకు అవసరమయిన రాజకీయ ప్రక్రియకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉండాలి.

## రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు

కేంద్ర కమిటీ నిర్ణయానికనుగుణంగా, ప్రతిపక్ష పార్టీలన్నిటిని సంప్రదించి మనం మీరా కుమార్ రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీచేసేందుకు మద్దతునిచ్చాము. బిజెపి అభ్యర్థి గెలుపు ఖాయమైనా, గత 50 సంవత్సరాలలో ఎన్నడూ రానన్ని అత్యధిక ఓట్లు ఆమెకు వచ్చాయి.

ఉపరాష్ట్రపతి వచ్చేసరికి, కాంగ్రెస్ వారు కాకూడదని మనం పట్టుపట్టడం వలన, మన ప్రతిపాదన ఆధారంగానే, ప్రతిపక్ష పార్టీలన్నీ గోపాల కృష్ణ గాంధీని ఉమ్మడి అభ్యర్థిగా నిలిపేందుకు అంగీకరించాయి. జెడి (యు), బిజెడి, ఏఏపి బాహాటంగానే ఉపరాష్ట్రపతి సభ్యుడికి తమ మద్దతు ప్రకటించాయి. మొదటి రెండు పార్టీలు రాష్ట్రపతి సభ్యత్వానికి మాత్రం బిజెపి అభ్యర్థికే మద్దతు నిచ్చాయి. ఉపరాష్ట్రపతి సభ్యత్వానికి (రెండు సభల ఎంపి లు) ఎన్‌డిఏకి అనుకూలంగా ఉన్నది. ప్రతిపక్ష పార్టీల ఎంపిక పార్లమెంటు సభ్యులలో ఎక్కువ ఉత్సాహాన్ని నింపింది.

## అతి పెద్దకూటమి – మహా గట్ బంధన్

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీల సహకారం తరువాత, మళ్ళీ అన్ని ప్రతిపక్ష పార్టీల కలయిక లేదా మహా కూటమి ఏర్పాటు ముందుకొచ్చింది. ముందు చెప్పుకున్నట్టే ప్రతిపక్ష పార్టీలలో గందరగోళాలు ఉన్నాయి. కానీ బూర్జువా ప్రతిపక్ష పార్టీలలో ఎవరో ఒకరు ఎప్పుడూ ఈ పిలుపును ఇస్తూనే ఉంటారు. సిపిఎం కి సంబంధించినంత వరకు, మనం వామపక్ష ప్రజాతంత్ర సంఘటన, దాని ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలు మాత్రమే బూర్జువా భూస్వామ్య వర్గ పరిపాలనకు దాని ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం కాగలదని స్పష్టంగా చెప్పాము. ఈ వామపక్ష ప్రజాతంత్ర సంఘటనను అభివృద్ధి చేసేందుకు సిపిఎం తన 21వ పార్టీ మహాసభలో ఈ విధంగా నిర్ణయించింది.

“పార్టీ తన సొంత బలాన్ని పెంచుకునేందుకు అభివృద్ధి చేసుకునేందుకు ప్రాముఖ్యతనిస్తుంది. అదే సమయంలో పార్టీ, దేశ సార్వభౌమత్వం కాపాడేందుకు, రాష్ట్రాల హక్కులు కాపాడేందుకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు కాంగ్రెస్ కాక ఇతర

లౌకిక పార్టీలతో, ఇతర ప్రజాతంత్ర శక్తులతో కలిసి ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలను అభివృద్ధి చేస్తుంది. ప్రజాఉద్యమాల ఐక్యవేదికలు, ఐక్య పోరాటాలు పార్టీ స్వతంత్రంగా ఎదగాలంటే ఎంతో అవసరం. వర్గ, ప్రజాసంఘాలతో ఐక్య కార్యాచరణలు కాంగ్రెస్, బిజెపి, ఇతర బూర్జువా పార్టీలలోని ప్రజాసమూహాలను మనవైపుకు తెస్తాయి.

**భారతదేశం-చైనా మధ్య ప్రతిష్టంభన :** ఇప్పటికి ఆరు వారాలనుంచి డోక్లామ్ పీఠభూమిలో, భారత్, చైనా, భూటాన్ త్రికోణ కూడలిలో భారతదేశం-చైనాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్నది. ఇది చైనా-భూటాన్‌కి సంబంధించిన అంశం. ఈ సరిహద్దు భారత చైనాలకు సంబంధించినది కాదు. అయితే భారతదేశం ఇది 'కోడి మెడ' (ఈశాన్య రాష్ట్రాలను కలిపే స్థలం)కు దగ్గరగా ఉన్నందువలన ఈ స్థలం కీలకమని అభిప్రాయపడుతున్నది. ఇంతకు ముందు కన్నా ఈసారి పరిస్థితి గంభీరంగా మారడానికి కారణం భారత్-చైనాల మధ్య సంబంధాలు దెబ్బతినడమే. భారతదేశం అమెరికాకు దగ్గరవుతున్నందువలన, మనం ఆసియా పసిఫిక్, హిందూ మహా సముద్రం ప్రాంతంలో అమెరికాతో వ్యూహాత్మక రూపకల్పనలలో కలిసి పనిచేస్తున్నాము. అమెరికా ప్రధాన ఉద్దేశం చైనాను నిరోధించడమే. ఇందులో భాగంగానే భారతదేశం ఓబి ఓఆర్ లో భాగస్వామ్యానికి ఒప్పుకోలేదు; దక్షిణ చైనా సముద్ర వివాదంలోనూ బాహాటంగా అమెరికాను బలపరిచింది. మనం అమెరికా జపాన్‌తో కలిసి చేసిన మలబార్ నావికా విన్యాసాలు ఈ మధ్యనే బే ఆఫ్ బెంగాల్‌లో ముగిసాయి. ఇది చైనాను నిలువరించడమే లక్ష్యంగా గల అమెరికా ప్రపంచవ్యాప్త వ్యూహాత్మక రూపకల్పనలలో భాగమైన దక్షిణ ఆసియాలో భారతదేశం పూర్తిస్థాయి భాగస్వామి అనే సంకేతాన్ని బిజెపి ప్రభుత్వం ఇచ్చింది.

భారత ప్రభుత్వం ప్రస్తుత ప్రతిష్టంభనను రాయబారుల ప్రయత్నాలతో, సంభాషణలతోను పరిష్కరించాలని అనుకుంటున్నట్టు ప్రకటించింది. మనం దీనిని స్వాగతిస్తున్నాము. ఇదే ప్రతిష్టంభన పరిష్కార మార్గమని చెప్పాము.

## విదేశాంగ విధానము

భారతదేశ విదేశాంగ విధానం అమెరికాకు దగ్గరవుతున్నాడన్న విషయం ఇప్పుడు మరింత స్పష్టమవుతున్నది. ప్రధాన మంత్రి ఇజ్రాయెల్ పర్యటన భారతదేశ విదేశాంగ విధానంలోని పెను మార్పును సూచిస్తున్నది. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక సంబంధం పెట్టుకోడానికి పాలస్తీనా విమోచనకు మద్దతును నీరుగార్చడానికి ప్రధాన మంత్రి పర్యటనతో ఆమోదం పొందినట్టయింది. భారతదేశం ఇజ్రాయేల్‌తో సైనిక, రక్షణ సహకారానికి వ్యూహాత్మక

సంబంధాలకి అంగీకరించింది. ఈ మధ్య కాలంలో భారతదేశం ఇజ్రాయెల్ నుండి ఆయుధాలు, మిలిటరీ పరికరాలు కొనుగోలుచేసిన అతి పెద్ద దేశం అయింది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం జియోనిజం కి దగ్గరగా ఉంటుంది. అందువలన మితవాద లికుడ్ ప్రభుత్వం ఇజ్రాయేల్ లోను ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వమూ ఒకే సిద్ధాంత బంధాన్ని కలిగి ఉన్నాయి. దురదృష్టం ఏమిటంటే ఇజ్రాయేల్ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని కనీసం పాలస్తీనాను సందర్శించనైనా లేదు. భారతదేశానికీ ఇజ్రాయేల్ కి మధ్య ఏడు ఒప్పందాలు సంతకం చేయబడ్డాయి. ఇది మోడీ ప్రభుత్వం మితవాద విదేశాంగ విధానం వైపు మొగ్గుతున్నారనడాన్ని బలపరుస్తుంది. అంటే భారతదేశం అలీన విదేశాంగ విధానాన్ని పూర్తిగా వదిలేసినట్టే. అమెరికా, ఇజ్రాయేల్, భారతదేశం కలయికతో ప్రపంచంపై ఆధిపత్యాన్ని సంపాదించవచ్చున్న ఆర్ఎస్ఎస్ దీర్ఘకాల కలకి ఇది అనుగుణంగా ఉన్నది. ఇదే ప్రమాదకర పరిణామం.

## కేంద్రకమిటీ పిలుపులు

***రాబోయే రోజులలో పార్టీ ఈ క్రింది కార్యక్రమాలను చేయాలని కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది***

1. 2017 ఆగస్టు 15 నుండి 31 వరకు అన్ని యూనిట్లలో సిపిఎం నిరసన ఉద్యమాలను మొదలుపెట్టాలి.

* అప్పుల బాధతో సతమతమయి ఆత్మహత్యలకు దారితీస్తున్న రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలి.

** బిజెపి ఎన్నికల వాగ్దానం అయిన ఉత్పత్తి ధరకు ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధరను వెంటనే అమలుచేయాలి. ఆ కనీస మద్దతు ధరకు రైతులు అమ్ముకునే వీలు కల్పించే హక్కును కల్పిస్తూ కేంద్రం వెంటనే చట్టం చేయాలి.

*** బిజెపి ఎన్నికల వాగ్దానం అయిన సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించడం వెంటనే అమలు చేయాలి.

****పెద్ద ఎత్తున ప్రభుత్వ రంగం, ప్రభుత్వ సేవలు ప్రైవేటు పరం చేయడం వెంటనే నిలిపివేయాలి.

*****వివిధ రంగాల ప్రజలపై మోపబడిన జిఎస్టి భారాన్ని వెనక్కి తీసుకోవాలి.

****** 2014 ఎన్నికల వాగ్దానం అయిన మహిళా రిజర్వేషన్ బిల్‌ను వెంటనే చట్టం చేయాలి.

2. 2017 సెప్టెంబర్ 1 వ తేదీని ప్రపంచ శాంతి, సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా అన్ని పార్టీ యూనిట్లు జరపాలి. మోడీ ప్రభుత్వం భారతదేశాన్ని అమెరికా జూనియర్ భాగస్వామిగా చేయడాన్ని, అమెరికా వ్యూహాత్మక భాగస్వామి కావడాన్ని ప్రముఖంగా చెప్పాలి. ప్రధాన మంత్రి ఇజ్రాయెల్ పర్యటన బిజెపి ప్రభుత్వ కోరిక అయిన అమెరికా ఇజ్రాయెల్, భారతదేశ భాగస్వామ్యం భారతదేశానికి, భారత ప్రజల ప్రయోజనాలకు భంగకరమని ప్రముఖంగా చెప్పాలి.

3. సెప్టెంబర్ నెలంతా దేశవ్యాప్తంగా పార్టీ అన్ని స్థాయిలలోను లౌకిక ప్రజాతంత్ర శక్తులను కూడగట్టేందుకు, మతతత్వ వ్యతిరేక కార్యక్రమాలు జరిపేందుకు చొరవ తీసుకోవాలి.

4. సెప్టెంబర్ నెలంతా దేశవ్యాప్తంగా పార్టీ అన్ని స్థాయిలలోను దళితులపై, ముస్లింలపై పెరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు తెలియచేయాలి. గోరక్షక సమితిలు, నైతిక పోలీసింగ్ పేరుతో ఆర్ఎస్ఎస్ చే ప్రోత్సహించబడుతున్న ప్రైవేటుసైన్యాన్ని నిషేధిస్తూ కేంద్రం చట్టం చేయాలి అని డిమాండ్ చేయాలి ...


**ముద్రణ : ఆగస్టు, 2017** **వెల :** ₹ 5

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్**

**ప్రతులకు**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ - 520 002, ఫోన్ : 0866 - 2577533, సెల్ : 9490099057

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

127068